



పతకాలు సాధించిన విద్యార్థులు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

- మేడ్చల్ విద్యార్థులకు 86 బంగారు పతకాలు

మేడ్చల్ టౌన్, జనవరి 28: నగరంలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో మేడ్చల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 మార్షల్ ఆర్ట్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు 86బంగారు పతకాలను సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో మేడ్చల్‌కు చెందిన విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బంగారు పథకాలను అందజేశారు. ప్రస్తుతం బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు మార్చిలో ఇండో నేపాల్ కరాటే టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

సండే సందడి



కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం సందర్శకులతో సందడిగా కనిపించింది. వీకెండ్ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు ప్రాజెక్టు పరిసరాలను చూస్తూ, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు.

- ధారూరు, జనవరి 28

ఊరడమ్మకు బోనం

పెద్దేముల్, జనవరి 28: మంబాపూర్ గ్రామంలో ఊరడమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే అమ్మవారికి గ్రామస్థులు పూజలు చేశారు. సాయంత్రం డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఊరు సల్లంగ ఉండాలని, పాడి, పంట బాగుండాలని మొక్కుకున్నారు.



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు (ఇన్‌సెట్‌లో ఊరడమ్మ అమ్మవారు)

- సాకారం కానున్న అన్నదాతల చిరకాల స్వప్నం
- మరాఠా, కన్నడ రాష్ట్రాల నుంచి పరుగులు తీసే కృష్ణానది
- భీమా నికర జలాలతో బీడు భూములకు నీరు
- అధికారంలోకి కాంగ్రెస్.. తెరపైకి వచ్చిన ఎత్తిపోతల పథకం
- మూడు నియోజకవర్గాల్లో 1.05 లక్ష ఎకరాలకు సాగునీరు
- గతంలో పథకం కోసం ఉద్యమాలు, పాదయాత్రలు
- 2014లో జీవో 69 అమలుకు గ్రీన్ సిగ్నల్
- భూత్పూర్ భీమా నుంచి కాలువలు, చెరువుల ద్వారా సాగునీరు

కొడంగల్ - నారాయణపేటపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోకస్


కొడంగల్‌లోని మెట్ట ప్రాంతాల అన్నదాతల చిరకాల స్వప్నం సాకారం కానుంది. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. ఈ పనులు త్వరలో చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో మూడు నియోజవర్గాల్లో భూములు సస్యశ్యామలం కానున్నాయి. ఈ పథకం పూర్తయితే ఉట్కూర్, నారాయణపేట, మక్తల్, ధన్వాడ, దామరగిద్ద, దౌల్తాబాద్, కోస్గి, మద్దూర్, కొడంగల్, బొంరాస్‌పేట్ మండలాల్లోని 1.05 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది.



నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు

కొడంగల్‌గలా!

మెట్ట ప్రాంతాలకు ఎత్తిపోతలు



కొడంగల్, జనవరి 28: కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. సాగునీటి ప్రాజెక్టులపై శనివారం జలవనరుల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం జీవో నెం.69 అమలుపై ప్రత్యేకంగా చర్చించారు. కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకం సాకారమైతే కొడంగల్ నియోజకవర్గంతో పాటు నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో 1.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.50 లక్షల జనాభాకు తాగునీరు అందుతుంది. సాగునీరు, తాగునీరు అందించే విధంగా ఈ పథకానికి రూపకల్పన చేశారు. నీరందని మెట్ట ప్రాంతాల అన్నదాతల చిరకాల స్వప్నమైన కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని సాకారం చేసే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. కొడంగల్ -నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించి 2014, మే 23న అప్పటి గవర్నర్ నరసింహన్ జీవో నెం.69 జారీ చేసినా అమలుకు నోచుకోలేదు. జీవో 69 అమలు కోసం ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి తాను కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న ఆసమయంలోనే ప్రత్యేకంగా చొరవ తీసుకుని నిధులు విడుదల చేయించినా గత ప్రభుత్వం కాలయాపన చేయడంతో ఆ పనులు ముందుకు సాగలేదు. మల్కాజ్‌గిరి ఎంపీ హోదాలో రేవంత్‌రెడ్డి పట్టువదలకుండా పార్లమెంట్‌లో సైతం కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకంపై గళం విప్పి పోరాటం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కొడంగల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో కొడంగల్, మక్తల్, నారాయణపేట ప్రాంతాల ప్రజల ఆకాంక్ష సాకారమయ్యేందుకు మార్గం సుగమంగా మారింది.



ఎత్తిపోతల ప్రాజెక్టు జీవో

మరాఠా, కన్నడ రాష్ట్రాల నుంచి కృష్ణమ్మ పరుగులు

మరాఠ, కన్నడ రాష్ట్రాల నుంచి పరుగులు తీసే కృష్ణానది నారాయణపేట జిల్లా కృష్ణా మండలం తంగేడి వద్ద తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కృష్ణమ్మ అడుగు పెట్టేది ఉమ్మడి పాలమూరులోని నారాయణపేట జిల్లాలోనే అయినా ఈ ప్రాంతంలోని ఎగువ ప్రాంతాలకు కృష్ణ జలాలు అందడం లేదు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో ఆ ప్రాంతానికి సాగునీరందిస్తామని గత ప్రభుత్వం హామీలు ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. భీమా ప్రాజెక్టుకు ఉన్న 20 టీఎంసీల నికర జలాల కేటాయింపులో బీమా రెండు దశల ఎత్తిపోతలకు 12.90 టీఎంసీల నీరు సరిపోతుందని అధ్యయనం ద్వారా తేల్చారు. మిగతా 7.10 టీఎంసీల నికర జలాలను కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకానికి కేటాయించారు. ఈ పథకం పూర్తి చేసి అత్యంత దుర్భిక్షప్రాంతానికి నీరందేలా చర్యలు తీసుకుంటే కేంద్రం అమలు చేసే ఎక్సిలెటరీ ఇరిగేషన్ బెనిఫిషరి ప్రాజెక్టు (ఏఐబీపీ) వర్తించనుంది. కేంద్రం 90 శాతం నిధులు మంజూరు చేయనుండగా, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు ఇస్తే సరిపోతుందని అప్పట్లో ప్రణాళికలు రూపొందించిన విషయం తెలిసిందే.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెరపైకి జీవో 69

గతంలో కొడంగల్ ఎమ్మెల్యేగా కొనసాగిన రేవంత్‌రెడ్డి కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని అమలు చేసే దిశగా తన వంతుగా ఎంతో ప్రయత్నాలు చేశారు. అయినా అధికార పార్టీ అనుకూలంగా లేకపోవడంతో నిధుల కేటాయింపు జరగలేదు. ఈ పథకాన్ని గత పాలకులు పెండింగ్‌లో ఉంచారు. పథకం అమలు కోసం జలసాధన కమిటీ, అఖిల పక్షం నాయకులు పోరాటాలు, ఉద్యమాలు చేపట్టినా ఫలితం దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో మరోసారి కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకం తెరపైకి వచ్చింది. ఈ పథకం కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుని మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. తాను హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎత్తిపోతల పథకం పనులు త్వరలో చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక దశలో జయమ్మ చెరువు ఎత్తిపోతల పథకం కోసం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సైకిల్ ర్యాలీతో వినతి పత్రం అందించారు. ఆ ఎత్తిపోతల పథకాన్ని కొడంగల్ వరకు విస్తరించి అమలు చేయాలని భావించి ఆ తర్వాత కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకంగా మార్చి 7.5 టీఎంసీల నీరు వినియోగమయ్యేలా పథకాన్ని రూపకల్పన చేశారు.

అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి దశలో రూ.133.13 కోట్లతో రూపొందించిన పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ నిధుల్లో రూ.3.36 కోట్లు ప్రాథమిక సర్వే కోసం, రూ.130.50 కోట్లు భూ సేకరణకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మొదటగా పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జూరాల నుంచి ప్రారంభించాలని భావించారు. నర్వ మండలం, ఎల్లంపల్లి మీదుగా నీటిని తోడి పోసుకుని కోయిల్ కొండ దగ్గర జలశయాలు నిర్మించి అక్కడి నుంచి కొడంగల్, నారాయణపేట ప్రాంతాలకు నీరందించాలని అంచనా వేసినా.. ముప్పు అధికంగా ఉండటంతో దిశను మార్చారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి...

అన్నదాతల చిరకాల స్వప్నం అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి సారించారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా మొదటి ప్రాధాన్యతగా కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకం అమలు చేసేందుకు అధికారులను ఆదేశించారు. దీంతో పాటు వికారాబాద్ - కృష్ణా రైల్వేలైన్ రీ సర్వేకు రూ.18 కోట్లు మంజూరు, కోస్గి పాల్‌టెక్నిక్ కళాశాల అప్‌గ్రేడ్‌తో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు, వృత్తి విద్య కోర్సు విశ్వవిద్యాలయం, కొడంగల్, కోస్గి ఆసుపత్రుల స్థాయి పెంపు ఇతరతర అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం అధికారులు నివేదికలు తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయ పరిశోధన కేంద్రం తదితర అభివృద్ధి పనుల కోసం స్థలాల సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు.

చివరి ఆయకట్టు మిగిలిందని ఆవేదన

గత ప్రభుత్వం ఈ ప్రాంతాలకు పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కర్వేన జలాశయం నుంచి నారాయణపేట కాలువ (108 కిలో మీటర్లు), ఉద్దండాపూర్ నుంచి మద్దూర్ కాలువ ద్వారా సాగునీరందిస్తామని తెలిపింది. దాదాపు 1.65 లక్షల ఎకరాలకు అంటే... కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకం కంటే ఎక్కువ ఆయకట్టుకు నీరందిస్తామని పేర్కొంది.. స్థానిక రైతులు, ప్రజాసంఘాలు, ప్రతిపక్షలు శ్రీశైలం నుంచి వచ్చే ఈ ప్రాజెక్టు నుంచి తమ ప్రాంతానికి నీరు రావాలంటే మధ్యలో రెండు, మూడు జిల్లాలు దాటి రావాలని, అలా వచ్చే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ప్రత్యక్షంగా 108 కిలో మీటర్లు అయితే పరోక్షంగా 200 పైగా కిలో మీటర్ల నుంచి నీరు రావాల్సి ఉంటుందని చెబుతున్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వరద జలాల పథకమని, నికర జలాల నుంచి తక్కువ దూరంలో ఏ జిల్లాకు సంబంధం లేకుండా కొడంగల్ -నారాయణపేట పథకం జీవో నెం.69ను అమలు చేస్తే మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

ఎత్తిపోతల పథకం అమలు ఇలా

భీమా-1 ఎత్తిపోతల పథకం కింద నిర్మించిన భూత్పూర్ జలాశయం నుంచి 4 దశల ఎత్తిపోతల ద్వారా ఈ పథకాన్ని చేపట్టాలని ప్రతిపాదించారు. ఊట్కూర్, జాజాపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి దగ్గర 4 దశల్లో ఎత్తిపోతల పథకాలు చేపట్టి ఉట్కూర్, జాజపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి, లక్ష్మీపూర్, ఈర్లపల్లి, దౌల్తాబాద్, హస్నాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట్ చెరువులను కలుపుకుని నిర్దిష్ట ఆయకట్టుకు నీరందించేలా డిజైన్ రూపొందించారు. ఈ పథకం పూర్తయితే ఉట్కూర్, నారాయణపేట, మక్తల్, ధన్వాడ, దామరగిద్ద, దౌల్తాబాద్, కోస్గి, మద్దూర్, కొడంగల్, బొంరాస్‌పేట్ మండలాల్లోని 1.05 లక్షల ఎకరాలకు సాగునీరందుతుంది. భూత్పూర్ రిజర్వాయర్ నుంచి చివరి ఆయకట్టు వరకు మొత్తం 54 కిలోమీటర్ల మేర కాలువల ద్వారా తక్కువ భూ సేకరణతోనే పథకం పూర్తి కానుంది.

సీఎం చొరవతో రైతుల కల సాకారం



సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కొడంగల్ ప్రాంత రైతుల కల సాకారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ పథకం పూర్తయితే రైతులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా ఉన్న కొడంగల్, నారాయణపేట, మక్తల్ ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందుతుంది.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎత్తిపోతల పథకంతో పాటు వికారాబాద్ - కృష్ణా రైల్వేలైన్, పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవడంలో నిమగ్నమయ్యారు.

తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి

జీవో 69, 72 కలిపి అమలు చేయాలి



ఉమ్మడి పాలమూరు పరిధిలోని కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాలు సాగునీటితో సస్యశ్యామలం కావాలంటే జీవో 69, 72లను కలిపి అమలు చేస్తే మేలు జరుగుతుంది. రెండు జీవోలను అమలు చేస్తే మరిన్ని ఎక్కువ ఎకరాలకు సాగునీరందించే అవకాశం ఉంటుంది. ఈ విషయమై త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి వివరిస్తాం.

- రాఘవాచారి, జలవనరుల సంఘం అధ్యక్షుడు

సాగునీరందిస్తే రైతులకు మేలు



అన్ని రంగాల్లో వెనకబడిన కొడంగల్ ప్రాంతానికి జీవో 69 అమలుతో సాగు, తాగునీరు అందుతుంది. వ్యవసాయ ఆధారిత పంటలపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న రైతులకు సాగునీరు అవసరం ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకం అమలుతీరుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- ఇందనూర్ బషీర్, సీపీఐ జిల్లా నాయకుడు

వస్తాయా.. రావా!

- పెండింగ్ బిల్లులపై సర్పంచుల్లో గుబులు
- మూడు రోజులే గడువు!
- నేడో, రేపో ప్రత్యేక పరిపాలన జీవో!



తాండూరు జనవరి 28 : మరో మూడు రోజులు అయితే సర్పంచ్‌లు మాజీ అవుతారు. ప్రత్యేకాధికారులుగా నేడు, రేపో సర్కార్ ఉత్తర్వులు జారీ చేసే అవకాశముంది. ఈ క్రమంలో రికార్డులన్నీ ప్రత్యేకాధికారుల చేతిలోకి వెళ్లనున్నాయి. గడువు దాటితే చెక్కుల వాలిడిటీ పూర్తివుతుంది. రకరకాల సాంకేతిక సమస్యలను మున్ముందు ఎదుర్కోవాల్సి వస్తుందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రెజరీలలో చేసిన పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పదవిలో ఉన్నప్పుడే బిల్లులు ఇవ్వలేదు. పదవి పోయాక ఇస్తారా.. అంటూ సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి 1న సర్పంచ్‌ల పదవి కాలం ముగియనుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి పనులు చేయించింది. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించింది. చేయకపోతే అప్పట్లో నోటీసులు ఇచ్చి మరి పనులు చేయించారు. బిల్లు లేమో నెలల తరబడి పెండింగ్‌లో పెట్టారు. ఈ బిల్లులు ఆర్థిక సంవత్సరం ముగుస్తే వస్తాయో..రావో.. అని టెన్షన్‌లో సర్పంచ్‌లున్నారు. జిల్లా వ్యాప్తంగా 565 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వైకుంఠ థామలు, క్రీడా ప్రాంగణాలు, రైతు వేదికలు, సీసీరోడ్లు, అంతర్గత రహదారులు తదితర పనులు చేయించేందుకు అప్పులు చేశారు. ఈనెల 28న రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ములుగు సన్మాన సభలో రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను త్వరలో విడుదల చేస్తామని ప్రకటించిన విషయం విదితమే. అయినా పది రోజులు దాటింది. దాటింది. ఇంకా సర్కార్ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని ట్రెజరీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది గ్రామ పంచాయతీలకు కేంద్రం విడుదల చేసిన నిధులను సైతం గత సర్కారు దారి మళ్లించిన సంగతి తెలిసిందే. అయితే ఈనెల 30 లోపు ప్రభుత్వ నిధులు విడుదల చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు. దీనిపై సర్కారు ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

జనరల్ ఫండ్ ఫ్రీజింగ్

గ్రామ పంచాయతీకి పన్నుల రూపాణా వచ్చే డబ్బులను జనరల్ ఫండ్ కింద జమ చేసినా కూడా ఆ నిధులపై మూడు, నాలుగు మాసాల నుంచి ఫ్రీజింగ్ కొనసాగుతుంది. రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ కూలీ పనులు ఆధారంగా జనరేట్ అయ్యే 40 శాతం నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, పానాదుల అభివృద్ధి, గ్రామ పంచాయతీ కార్యాలయాల భవన నిర్మాణం పనుల బిల్లులు సక్రమంగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ట్రేజరీల్లో జమ చేస్తున్న జనరల్ ఫండ్‌తో చేపట్టిన పనులు బిల్లులు కూడా పాస్ కావడం లేదని సర్పంచ్‌లు వాపోతున్నారు. అప్పులతో అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు.

ఘనంగా గట్టుమైసమ్మ జాతర

- జనసంద్రమైన ఆలయ పరిసరాలు
- అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- బోనం, తొట్టెలను సమర్పించిన పోలీసులు

ఘట్‌కేసర్, జనవరి 28 : ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం జాతరకు భక్తులు వేలాదిగా తరలిరావడంతో దేవాలయ పరిసరాలు జనంతో కిటకిటలాడాయి. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ అనంతరం జరిగే గట్టుమైసమ్మ జాతరకు ఘట్‌కేసర్ మండల పరిధిలోని ప్రజలతో పాటు నగరవాసులు తరలివచ్చారు. ఉదయం 5గంటల నుంచే భక్తులు అమ్మవారిని దర్శిచుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అంతే కాకుండా ఈ జాతరలో భవిష్యవాణికి ఎంతో ప్రత్యేకత ఉంటుంది. ఈసారి జాతరలో రాచవేల్పుల శ్రీకాంత్ భవిష్యవాణి వినిపించారు. తననుకొలిచే వారికి ఎల్లప్పుడు కొంగు బంగారమవుతానని వివరించాడు. గట్టుమైసమ్మ జాతర సందర్భంగా ఘట్‌కేసర్‌లోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిని దాటేందుకు ట్రాఫిక్, స్థానిక పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టుమైసమ్మ అమ్మవారికి బోనం, తొట్టెలను సమర్పించారు.



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



బోనం, తొట్టెలను సమర్పిస్తున్న పోలీసులు

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

ఘట్‌కేసర్‌లోని గట్టుమైసమ్మ జాతర సందర్భంగా ఆదివారం అమ్మవారిని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ మంత్రి బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్. బీజేపీ నాయకుడు మురళీధర్‌రావు, టీపీపీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అమ్మవారిని దర్శంచుకోని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. వైస్ ఛైర్మన్ పల్లుగల మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో 'ధరణి' సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల, జనవరి 28 : గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులతో ధరణి సమస్యలు పరిష్కారమవుతాయని చేవెళ్ల ఎంపీపీ మాల్గారి విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం చేవెళ్లలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలోచనచేసి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ కమిటీల పేరుతో కాలయాపన చేయెద్దని, ప్రజల వద్దకే పాలనపై దృష్టిసారిస్తే ధరణి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అధికారులు గ్రామస్థాయిలో అభిప్రాయాలు తీసుకొని సమస్యలు పరిష్కారం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా స్థాయిలో భూసమస్యల పరిష్కారం అనేది సాధ్యమయ్యేది కాదన్నారు. కమిటీలు అంటూ కాలయాపన చేసి సమస్యలను మరింతగా పెంచడం సరికాదన్నారు. ఇప్పటికే ధరణి సమస్యల కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. భూమికి సంబంధం లేని వ్యక్తుల పేర్లు రికార్డుల్లో రావటం, ఉన్న భూమికంటే ఎక్కువ భూమి నమోదు కావటం, కొందరికి తక్కువ నమోదు కావడం వంటి సమస్యలున్నాయని అన్నారు. అదేవిధంగా పేర్ల నమోదులో కూడా చాలా తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేసే ఆప్షన్ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ధరణి సమస్యలు పరిష్కరించి అందరికీ న్యాయం చేయాలని ఎంపీపీ కోరారు.


పంచభూతీశ్వర ఆలయంలో చండీహోమం



పంచభూతీశ్వరాలయంలో చండిహోమం నిర్వహిస్తున్న అర్చకులు

కొత్తూర్, జనవరి 28 : మండల పరిధిలోని తీగాపూర్ గ్రామ శివారులో గల పంచభూతీశ్వర ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పంచభూతీశ్వర ఆలయ వ్యవస్థాపకుడు, రాష్ట్రపతి పురస్కార్ గ్రహీత డాక్టర్ పీజీ కేశవులు ఆధ్వర్యంలో ఆదివారం ఆలయ ప్రాంగణంలో వేద పండితులు చండీహోమంతో పాటు, చతుష్టి లలితాదేవి అమ్మవారికి, ప్రధాన దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ లోకకల్యాణం కోసం పంచభూతీశ్వర ఆలయాన్ని స్థాపించి, ప్రధాన దేవతగా చతుష్టి లలితాదేవి అమ్మవారిని ప్రతిష్ఠించామని చెప్పారు. ఈనెల 22న శ్రీ సీతారామచంద్రుల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించామని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టు ప్రక్కన ఇలాంటి ఆలయం మరెక్కడా లేదన్నారు. లోక కల్యాణం కోసం ఎన్నో యాగాలు జరిపినట్లు తెలిపారు. ఆనంతరం అన్నదానం నిర్వహించారు. విజయ్‌భాస్కర్, వర్ధముని, జీఎస్ చక్రవర్తి, బీవీ ప్రదీప్, భక్తులు పాల్గొన్నారు.

ఏకగ్రీవాలకు ప్రోత్సాహమేది



- పదవీ కాలం ముగుస్తున్నా అందని నజరానా
- జిల్లాలో ఆ పంచాయతీలు 75
- రూ.10 లక్షలు చెల్లిస్తామని గత సర్కారు హామీ

వికారాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నాలుగు రోజుల్లో పదవీకాలం ముగియవస్తున్నా ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు గత ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నజరానా నిధులు అందలేదు. ఏకగ్రీవమైతే ప్రోత్సాహక నిధులు వస్తాయని ఆశించిన పాలకవర్గాలకు చివరకు నిరాశే మిగిలింది. అయిదేళ్ల పదవీకాలం ముగియవచ్చినా ఆ నిధులు విడుదల చేయకపోవడంతో ఆయా పాలకవర్గాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ప్రోత్సాహక నిధులతో గ్రామాల్లో సమస్యలు పరిష్కరించుకోవచ్చని భావించిన వారికి నిధులు విడుదల చేయకుండానే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని, అధికారంలో ఉన్నప్పుడు మొండి చెయ్యి చూపిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీ పాలకమండలిల పదవీ కాలం ఫిబ్రవరి 2న ముగుస్తుంది. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ ఏకగ్రీవ పంచాయతీల పాలక వర్గాలకు ప్రోత్సాహక నజరానా అందేలా లేదు. జిల్లాలో మొత్తం 566 గ్రామ పంచాయతీలు ఉండగా, 2019 జనవరిలో వాటికి మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో 75 పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికై అదే ఏడాది ఫిబ్రవరి 2న కొలువుదీరాయి. స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు రూ.10 లక్షలు ప్రోత్సాహకంగా ఇస్తామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. ఆ నిధులకుతోడు మరో రూ.5 లక్షలను నియోజకవర్గ అభివృద్ధి నిధుల్లో నుంచి కేటాయిస్తామని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు.

ప్రత్యేక గుర్తింపు వస్తుందని..

ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నజరానాతో పాటు తమ గ్రామాలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని భావించి పంచాయతీ పాలక వర్గాలు ఏకగ్రీవమయ్యేలా అన్ని వర్గాల ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు విబేధాలను పక్కనపెట్టి కృషి చేశారు. ఆ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టవచ్చని భావించి ఆ దిశగా అందరూ ఒకేతాటిపైకి వచ్చారు. ఎన్నికల సమయంలో బరిలో నిలిచిన వారిని పోటీ నుంచి తప్పించేందుకు ఎంతో కొంత ముట్టజెప్పి ఏకగ్రీవమయ్యేలా కృషి చేశారు. ఏకగ్రీవమయ్యేందుకు తమకు ఖర్చులు తడిసి మోపెడైనా గ్రామాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని భావించి ఆయా నాయకులు కృషి చేశారు. కానీ వారికి చివరకు నిరాశే మిగిలింది. జిల్లాలో ఏకగ్రీవమైన ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షల ప్రోత్సాహకం అందించాల్సినవి రూ.7.50 కోట్లు, నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి ఇస్తామన్న మరో రూ.3.75 కోట్లు విడుదల చేయాల్సి ఉంది.

కొత్త ప్రభుత్వమైనా ఇవ్వాలి

ప్రభుత్వం ఇవ్వాలసిన నజరానా కోసం ఆయా పాలక వర్గాలు ఎదురు చూస్తున్నాయి. గతంలో పలుమార్లు మాజీ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని పలువురు సర్పంచ్‌లు వాపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందైనా నిధులు విడుదల చేస్తారని పాలకవర్గాలు ఆశించినా నిరాశే ఎదురైంది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు విడుదల చేసి ఆదుకోవాలని ఏకగ్రీవ పంచాయతీల సర్పంచులు, ప్రజలు కోరుతున్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో
ఆమనగల్లు విద్యార్థుల ప్రతిభ



చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులు

ఆమనగల్లు, జనవరి 28 : అంతర్జాతీయ కరాటే పోటీల్లో మండలానికి చెందిన జపాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో చాంపియన్‌షిప్ సాధించారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం వరల్డ్ నకాయామ్ చోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండవ అంతర్జాతీయ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ - 2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మాస్టర్ జగదీశ్వర్ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులు అనీష్, శ్రీహాన్, లోకేష్, జగదీశ్, రిత్విన్, దేవానంద్, ప్రవీణ్, వంశీ, శిరీష పాల్గొని సత్తా చాటారు. జాతీయస్థాయిలో చాంపియన్‌షిప్‌తో పాటు ఐదు గోల్డ్, నాలుగు సిల్వర్ మెడల్స్ సాధించారు. నకాయామ్ చోటో ఖాన్ కరాటే నిర్వాహకుడు అమర్‌సింగ్ విజేతలకు మెడల్స్, ప్రశంస పత్రాలు అందజేశారు. మాస్టర్ జగదీశ్వర్‌ను అభినందించి షీల్డ్‌ను బహుకరించారు. అంతర్జాతీయ కరాటే పోటీల్లో సత్తాచాటిన ఆమనగల్లు విద్యార్థులను పలువురు అభినందించారు.

ప్రజలందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, జనవరి 28 : ప్రజలందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అవుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గుంజల్‌పహాడ్‌లో జడ్పీ నిధులతో నిర్మించిన అంగన్వాడీ కేంద్ర నూతన భవనాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం పేరిట గ్రామ పంచాయతీలను అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిందని విమర్శించారు. ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ పని చేస్తుందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ ఖచ్చితంగా నేరవేర్చుతామన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చెయకుండా బాధ్యతయుతమైన పాలన అందిస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. సర్పంచుల పదవీకాలం నాలుగు రోజుల్లో ముగుస్తుందని ఐదు సంవత్సరాలుగా సేవ చేసినందుకు వారిని అభినందించారు. సేవ చేసిన నాయకులను ప్రజలు ఎప్పుడు మరిచి పోరని చెప్పారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మహిళా, శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి అన్నారు. మహిళలకు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందించాలని అన్నారు. భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జడ్పీకి ఎమ్మెల్యే నిధులు తోడైతే గ్రామాల అభివృద్ధి మరింత సాధ్యం అవుతుందన్నారు. స్థానిక సమస్యలపై దృష్టి సారించి పని చేస్తేనే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. జడ్పీటీసీ స్వరూప, సర్పంచ్ జ్యోతి, బాల్‌రాజ్, గోపాల్, ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, సీడీపీవో నాగమణి, మండలఅధ్యక్షుడు రాజు, చంద్రశేఖర్, వెంకట్‌నర్సింహారెడ్డి, వేణుగోపాల్, అన్వర్, రాజు, పాల్గొన్నారు.

కొడంగల్ సమగ్రాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ఉత్తర్వులు
- కొడంగల్, కోస్గి ఆసుపత్రుల అప్‌గ్రేడ్



కొడంగల్ ప్రభుత్వాసుపత్రి

కొడంగల్, జనవరి 28 : సొంత నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ప్రాంత రూపురేఖలు మార్చేందుకు శ్రీకారం చుట్టారు. కొడంగల్ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా 'కడా' ను ఏర్పాటుచేసి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ప్రత్యేకాధికారిగా వెంకట్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించడంతో విద్య, వైద్యం, ఉపాధిపై దృష్టి సారించారు. అందులో భాగంగా కోస్గి ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా, కొడంగల్, కోస్గి ప్రభుత్వాసుపత్రులను 100 పడకలతో అప్‌గ్రేడ్ చేస్తూ విద్యా, వైద్యశాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఇంజనీరింగ్ తరగతులను ప్రారంభించేందుకు కసరత్తులు ప్రారంభించింది. మూడు బీటెక్ కోర్సుల్లో 180 సీట్ల భర్తీకి అవకాశం కల్పిస్తూనే పాల్‌టెక్నిక్ తరగతులను యథాతంగా కొనసాగించాలని చెప్పింది. పాల్‌టెక్నిక్ కళాశాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలు, బోధన సిబ్బంది, సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (ఏఐఅండ్‌యంఎల్), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డేటా సైన్స్ కోర్సుల రూపకల్పనతో పాటు తదుపరి అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేశం చెప్పారు.

ప్రభుత్వాసుపత్రుల అప్‌గ్రేడ్

కొడంగల్, కోస్గి మునిసిపాలిటిల్లోని ప్రభుత్వాసుపత్రులను 100 పడకల ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తూ అధికారులు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. గతంలో రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఈ కృషి చేసినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం తానే సీఎంగా ఉండటంతో ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. బీజాపూర్-హైదరాబాద్ హైవే రోడ్డు, మహబూబ్‌నగర్-చించోలి ప్రధాన రహదారులు కొడంగల్ మీదుగా వెళ్లడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సకాలంలో వైద్య సేవలు అందక, సౌకర్యాలు లేక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతలపై దృష్టి

అన్ని రంగాల్లో వెనకబాటుకు గురైన కొడంగల్ ప్రాంతాన్ని గత పాలకులు పట్టించుకోకపోగా రవాణా, ఉపాధి, మౌలిక సదుపాయలు కల్పించడంలో విఫలం చెందారు. కానీ ప్రస్తుతం సీఎం ప్రత్యేక చొరవతో కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకంతో పలు నియోజకవర్గాలకు తాగు, సాగునీరందించేందుకు కృషి చేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ రీ సర్వే కోసం రూ.18 కోట్లు విడుదల చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, పరిశ్రమల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం, కళాశాల ఏర్పాటుకు 50 ఎకరాల స్థలం ఎంపికలో అధికారులు నిమగ్నమయ్యారు. కొడంగల్, కోస్గి ఆర్టీసీ డీపోల అభివృద్ధిపై దృష్టి సారించారు. గురుకుల పాఠశాలలకు నూతన భవనాల నిర్మాణానికి స్థలాలను పరిశీలిస్తున్నారు. గ్రామాల వారీగా అభివృద్ధి నివేదికలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. గతంతో కన్నా ప్రస్తుతం కొడంగల్ అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తున్నదని ప్రజలు చర్చించుకుంటున్నారు.



ఇంజినీరింగ్ కళాశాలగా మారనున్న కోస్గి పాల్‌టెక్నిక్ కళాశాల

సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు



సీఎం ఆదేశాల మేరకు కొడంగల్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటు ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం. గ్రామాల వారీగా అన్నీ రంగాల్లో అభివృద్ధి పనులకు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తాం. ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వాసుపత్రుల అప్‌గ్రేడ్ కోసం అధికారులు కసరత్తులు ప్రారంభించారు.

- వెంకట్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి

ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

చేవెళ్ల, జనవరి 28 : ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించి, పదోన్నతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మారికా పాఠశాల ఆవరణలో ఆ సంఘం జిల్లా కమిటీ విస్తృస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించలేదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధుల సిఫారసులతో జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులను తిరిగి వారి సొంత జిల్లాలకు పంపించాలని జిల్లా అధ్యక్షుడు కె. గోపాల్‌నాయక్ అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కల్పన, ఆడిట్‌కమిటీ చైర్మన్ రఘుపాల్, జిల్లా కార్యదర్శులు నాగేంద్రం, వెంకటయ్య, కిషన్ చౌహన్, బీమ్‌రెడ్డి, భగవంత్‌రాజ్, రామకృష్ణ, భువనేశ్వరి, శివారెడిద్ధ, నర్సింలు, బుగ్గరాములు, గణేశ్‌కుమార్, శ్యామలాదేవి, శంకర్‌నాయక్, మహమ్మద్ అక్బర్, రాష్ట్ర కమిటీ సభ్యులు సుగంధం, చేవెళ్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు గణేశ్, లాలయ్య, నాయకులు కిరణ్‌మహేందర్ రెడ్డి, వెంకటేశ్, విజయ్‌కుమార్, కృష్ణ, యాదగిరి,అక్షయ్, చంద్రశేఖర్, ప్రభాకర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

పరిగి అభివృద్ధిపై నీలినీడలు

- మంజూరైన నిధులు రద్దయ్యే అవకాశం
- కొత్త ప్రభుత్వంపై ప్రజల ఆశలు



పరిగి పట్టణం

పరిగి, జనవరి 28 : గత ప్రభుత్వం పరిగి మునిసిపాలిటీ అభివృద్ధికి మంజూరు చేసిన నిధులపై నీలినీడలు కమ్ముకున్నాయి. మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పరిగి పట్టణ అభివృద్ధి కోసం జూలైలో రూ.25 కోట్ల నిధులను పురపాలక శాఖ నుంచి తీసుకువచ్చిన సంగతి విదితమే. ఈ సందర్భంగా బస్తీబాట పేరిట మహేశ్‌రెడ్డి పర్యటించి చేపట్టబోయే అభివృద్ధి పనులను మునిసిపల్ పరిధిలోని 15 వార్డుల్లోని కాలనీల్లో పనులను గుర్తించారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులతో అంచనాలను తయారు చేసి ప్రతిపాదనలు పంపారు. ఈ పనులు టెండర్ దశలో ఉండగానే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం ప్రభుత్వం మారడంతో మంజూరైన నిధుల విడుదలపై ఆయోమయం నెలకొంది. రూ.25 కోట్ల నిధుల విడుదలు విడుదలై పనులు కొనసాగితే పరిగి పట్టణాభివృద్ధి జరిగేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పూర్తయిన అభివృద్ధి పనుల బిల్లులను ప్రభుత్వం చెల్లించే పరిస్థితి లేదు. ఇప్పటికే పలు పనులను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. పరిగికి మంజూరైన నిధులు కూడా రద్దయ్యే అవకాశం ఉందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎన్నికైన ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఈ నిధులను విడుదల చేయించి, పనులు పూర్తి చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



పరిగిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నాటి ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి(ఫైల్)

టెండర్ దశలో ఉంది



గత ప్రభుత్వం రూ.25 కోట్ల నిధులను మంజూరీ చేసింది. అభివృద్ధి పనులను గుర్తించి పంపించాం. పనులు టెండర్ దశలో ఉండగా ప్రభుత్వం మారింది. ప్రభుత్వం మారినా నిధులు వస్తాయనే నమ్మకం ఉంది. నిధుల విడుదల కోసం అవసరమైతే ప్రభుత్వ పెద్దలను కలిసి విన్నవిస్తాం.

ఎం.అశోక్, మునిసిపల్ చైర్మన్, పరిగి

ఘనంగా మల్లన్న కల్యాణోత్సవం



మలికార్జున స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్‌రూరల్ ,జనవరి 28 : మండల పరిధిలోని హమీదుల్లా నగర్‌లో మల్లికార్జున స్వామి (మల్లన్న) కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, షైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ నీరటి తన్వీరాజు, ఎంపీపీ జయమ్మశ్రీనివాస్ పాల్గొని మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని మహిళలంతా బోనాలను నెత్తి పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లిన స్వామివారికి బోనాలను సమర్పించారు. ప్రతి ఏడాది మల్లన్న జాతర ఘనంగా నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానాని ఎమ్మెల్యే చెప్పారు. మల్లన్న ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. తనవంతు ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి మల్లన్న చెప్పారు. సర్పంచ్ సతీష్‌యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గుట్టలు, క్రషర్లపై
వడ్డెరలకు పూర్తి హక్కులివ్వాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విఘ్నేశ్, తదితరులు

కందుకూరు, జనవరి 28 : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని గుట్టలు, క్రషర్‌లపై పూర్తి హక్కులను వడ్డెర వృత్తిదారులకు ఇవ్వాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మీర్కాన్‌పేటలోని క్రషర్ వద్ద ఆ సంఘం రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల శాఖ అధ్యక్షుడు వెంకటయ్య ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పెద్దపెద్ద గుట్టలు పెత్తందారుల చేతుల్లోకి వెళ్లి పూర్తిగా అంతరించి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పూర్వీకులు ఆ గుట్టల్లో గ్రానైట్, కంకరను కొట్టుకుని కుటుంబాలను పోషించుకునేవారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వడ్డెర ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబాలకు ప్రమాద బీమా, రేషన్‌కార్డులు, ఇళ్లు, స్థలాలు, ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆ సంఘం నేతలు విష్ణు, శ్రీనివాస్, లక్ష్మయ్య, దేవయ్య, నర్సింహా, రాజు, రాంచంద్రి, కృష్ణ, బుచ్చయ్య, జంగయ్య, విజయేందర్, శ్రీశైలం, అంజయ్య పాల్గొన్నారు.

'ఆ పార్టీ నాయకులను రానివ్వొద్దు'

ధారూరు, జనవరి 28 : తమ నాయకులు, కార్యకర్తలను బెదిరించి కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రయత్నించిన ప్రత్యర్థి నాయకులను పార్టీలోకి రానివ్వొద్దని నాయకులు ముక్తకంఠంతో అధిష్ఠానం పెద్దలను కోరుతున్నారు. పదేళ్ల అధికారంలో ఉండి కాంగ్రెస్ పార్టీని, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను విమర్శించిన నాయకులు తమ పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిని చేర్చుకుంటే ప్రజలలో బదునాం అయ్యే ప్రమాదం ఉందని కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లోకి రాని ఆ నాయకులు ఇప్పుడు వస్తామంటే ఎట్టి పరిస్థితులలో పార్టీలోకి తీసుకోకూడదని పార్టీ శ్రేణులు స్పీకర్ ప్రసాద్‌కుమార్, పార్టీ పెద్దలను కోరుతున్నారు. పదేళ్ల ప్రతిపక్షంలో ఉండి ఎన్నో కష్టనష్టాలకు ఎదురొడ్డి నిలబడి ఎన్నికలలో పార్టీని గెలిపించిన కార్యకర్తలను గుర్తించాలని వారు అభిప్రాయపడుతున్నారు. పదవులు, కాంట్రాక్టు పనులు, పైరవీలు చేసి డబ్బులు సంపాదించుకునేందుకే కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న వారికి చెక్ పెట్టాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. స్వప్రయోజనాల కోసం వచ్చే వారిని చేర్చుకుంటే క్యాడర్ నిరత్సాహానికి గురై పార్టీకి ఇబ్బందులు ఎదురవుతాయని వారు తమ నాయకుల వద్ద వాపోతున్నారు.

తొలిదశ ఉద్యమకారుడు వీరారెడ్డికి ఘన నివాళి



వీరారెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మూడుచింతలపల్లి, జనవరి 28 : తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు కామిడి వీరారెడ్డి 21 వ వర్ధంతిని మూడుచింతలపల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ప్రధాన కూడలిలోని వీరారెడ్డి విగ్రహానికి ఆయన కుటుంబసభ్యులు, సర్పంచ్ జాము రవి, ఎంపీపీ హారిక పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాము రవి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు వీరారెడ్డి చేసిన సేవలను గుర్తించి ఆయన జ్ఞాపకార్థంగా మూడుచింతలపల్లిని నూతన మండలంగా ప్రకటించారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వీరారెడ్డి పేరు పెట్టాలని అధికారులను ఆదేశించారని చెప్పారు. మూడుచింతలపల్లికి రాష్ట్ర స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావడానికి వీరారెడ్డి కృషి చేశారని, అభివృద్ధి అంతా ఆయన చొరవతోనే జరిగిందని గుర్తుచేశారు. ఉపసర్పంచ్ వెంకటరమణరెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 16న
కార్మిక, కర్షక సంఘాల దేశవ్యాప్త సమ్మె

వికారాబాద్, జనవరి 28: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆల్‌ట్రేడ్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్. మహిపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా కార్యదర్శి గీత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు గోపాల్‌రెడ్డి, మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లయినా కార్మిక, రైతాంగ సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. భారత్ వెలిగిపోతుందని చెబుతూ ఆత్మ నిర్భర్ భారత్, మేకిన్ ఇండియాల పేరిట మోస పూరిత నినాదాలు ఇచ్చిందని, వాటితో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ వాగ్దానం చేసి, ఇవ్వడం లేదన్నారు.

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు

- తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్


తాండూరు రూరల్: గుంతబాస్పల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు రూరల్, జనవరి 28: భారత రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆదర్శ ప్రాయుడని, ఆయన ఆశయసాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. మండలంలోని గుంతబాస్పల్లి గ్రామంలో ఆదివారం సర్పంచ్ ఏర్పుల జగదీష్ అధ్యక్షతన బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న డీఎస్పీ శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ భారత దేశశక్తిలా ఎదిగారని, మనం కూడా కష్టపడి చదివి దేశ భవిష్యత్తు కోసం ఉన్నతాస్థానంలో నిలవాలన్నారు. ప్రతీ వ్యక్తి క్రమశిక్షణ, జ్ఞానంతో జీవితంలో ఎదిగేందుకు పట్టుదల ఉండాలన్నారు. తాండూరు మండల జడ్పీటీసీ గౌడి మంజుల, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్‌లు మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి రాజ్యాంగాన్ని రచించి వాడవాడల్లో నిలిచారని, ఆయన కృషి ఆయన ఆశయాలు నెరవేర్చేందుకు మనమంతా కృషి చేయాలన్నారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళీకృష్ణాగౌడ్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ దళిత సామాజిక వర్గానికి చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన పేదవాడు కాదని, సైనికుడి కుమారుడని తెలిపారు. చదువుకోవడానికి రైల్వే స్టేషన్లలో ఉండి చదువుకుని జ్ఞానవంతుడిగా ఎదిగాడని గుర్తుచేశారు. ఆయన జ్ఞానమే రాజ్యాంగ రచనకు దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ స్వరూపా, ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్, సర్పంచ్‌లు ఏర్పుల జగదీష్, కుర్వ నాగార్జున, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, రాందాస్, మాజీ వైస్‌ఎంపీపీ మొగులప్ప, మాజీ సర్పంచ్ మల్లప్ప, షేక్ ఇస్మాయిల్, ఉపసర్పంచ్‌లు ఖైరత్‌అలీ, గోవింద్, నాయకులు ప్రవీణ్ గౌడ్, అజ్మత్, హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్.వెంకట్‌రాంరెడ్డి, రాముయాదవ్, ఉదయభాస్కర్‌రెడ్డి, కోతి గోపాల్, కరన్‌కోట్ జగదీశ్వర్, అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు, దళిత సంఘం నాయకులు శంకరప్ప, కృష్ణ, పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులకే పరిమితం కావొద్దు



మాట్లాడుతున్న డైరెక్టర్ ప్రశాంత్ వర్మ

మేడ్చల్ టౌన్, జనవరి 28: విద్యార్థులు చదువుకే పరిమితం కావొద్దని సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో అభిరుచి పెంచుకోవాలని ప్రముఖ సినీ డైరెక్టర్, స్క్రిప్ట్‌రైటర్ ప్రశాంత్‌వర్మ అన్నారు. మేడ్చల్ పట్టణం అత్వెల్లి విజ్ఞాన్ గ్లోబల్ జైన్ పాఠశాలలో శనివారం రాత్రి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రశాంత్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులతో పాటు ఇతర రంగాలపై ఆసక్తి కనపరచాలన్నారు. అన్నిరంగాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే వారు జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని అన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాటు, పలు అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్‌చైర్మన్ రాణి రుద్రమ దేవి, పాఠశాల హ హెచ్‌ఎం జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు


పరిగి: సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు


బషీరాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు)లో ఒకే వేదికపై అప్పటి గురువులు, పూర్వ విద్యార్థులు

పరిగి, జనవరి 28: పరిగిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1993-94 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థులు ఒకేచోట కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు రహీమున్నిసాబేగం, మేఘమాల, సరితల ఆధ్వర్యంలో ఆదివారం ఈ సమ్మేళనాన్ని నిర్వహించారు. వారికి విద్యాబుద్దులు నేర్పిన గురువులు హిందీ పండిట్ జి.గాంధీ, వెంకట్‌రెడ్డి, వీరన్న, చంద్రయ్య విద్యార్థులు సన్మానించారు. 30ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

బషీరాబాద్: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలురు)లో 1984-85 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. వీరందరూ 39సంవత్సరాల కిందట ఒకే పాఠశాలలో చదివిన సుదీర్ఘకాలం తర్వాత ఒకేవేదికపై చేరి పాత రోజులను గుర్తుచేసుకున్నారు. అందరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. అప్పట్లో చదువు నేర్పిన గురువులు లక్ష్మయ్య, హన్మయ్య, భాగ్యవతి, రాంచంద్రారెడ్డి తదితరులను పూర్వవిద్యార్థులు కలిసి సన్మానించుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వేదంచారి, నాగయ్య, నర్సింహులు, భీంశేన్‌రావు, నారాయణరెడ్డి, మణిక్‌ప్రభు, శకుంతల, రుక్మిణి, మున్సిపల్ సీనియర్ ఉద్యోగి కృష్ణ, లత, పాండురంగా రెడ్డి, మల్లికార్జున్, జగదాంబ పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యం అందేలా చూస్తా

పరిగి, జనవరి 28: పరిగి నియోజకవర్గ పేదలందరికీ ఉచిత వైద్యం అందించే బాధ్యత తనదని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. టీఆర్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(ట్రిమ్స్) ఆధ్వర్యంలో ఆదివారం పరిగి ఎమ్మెల్యే టీఆర్ఆర్ నివాసంలో ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. క్యాంపులో 520 మందికి పైగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. వీరిలో అత్యవసర ఆరోగ్య చికిత్సలు అవసరం ఉన్న 100మందిని ప్రత్యేక బస్సుల్లో పఠాన్‌చెరులో ట్రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. గత 15 ఏళ్ళుగా పరిగి ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా రూ.10లక్షలకు పెంచినట్లు తెలిపారు. పేదలందరికీ రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందిస్తామని తెలిపారు. ఎంఆర్ఎఫ్ ద్వారా చేయూతనందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రిమ్స్ వైఎస్ చైర్మన్ టి.రీత్విక్‌రెడ్డి, కోశాధికారి టి.ఉమారామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మున్నూరు కాపుల సంక్షేమానికి పాటుపడాలి


మాట్లాడుతున్న మండల ఈశ్వరయ్య

మేడ్చల్ టౌన్, జనవరి 28: ఆర్థికంగా వెనుకబడిన మున్నూరుకాపు కులస్తుల సంక్షేమానికి పాటుపడాలని మున్నూరు కాపు సంఘం మేడ్చల్ మండల అధ్యక్షుడు మండల ఈశ్వరయ్య అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీలో ఆదివారం మున్నూరు కాపు సంఘం మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఈశ్వరయ్య మాట్లాడుతూ.. తమ సామాజిక వర్గంలో వెనుకబడిన కుటుంబాల పిల్లలకు చదువుకోవడానికి నోట్‌బుక్‌లు, ఇతర ఉపకరణాలను ఉచితంగా ఉందజేస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ చాలా మంది పేదల సమస్యలు తీరడం లేదన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా మున్నూరుకాపు కులస్తులకు మేలు జరిగే విధంగా సంఘం నాయకులు కృషి చేయాలన్నారు. మున్నూరు కాపు కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదుగాలంటే రాష్ట్రంలో మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పడాలని, అందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మున్నూరు కాపు కులస్తుల చేపట్టే కార్యకలాపాలపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సురేష్, రాంగోపాల్, కన్న, నాగరాజు, మురళీధర్, అనీల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శివదీక్షతో ప్రశాంతత


శివదీక్షా మలధారణోత్సవానికి హాజరైన మునీంద్ర శివాచార్యస్వామితో భక్తులు

బషీరాబాద్, జనవరి 28: శివ దీక్ష మనసుకు ప్రశాంతత లభిస్తుందని పూజ్యశ్రీ వీరతపస్వి మునీంద్ర శివాచార్యస్వామి హల్‌కట్టి అన్నారు. మండలంలోని నవాంద్గీ సంగమేశ్వరాలయం సన్నిధిలో ఆదివారం నిర్వహించిన శివదీక్షామాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 95 మంది భక్తులు మునీంద్ర శివచార్యస్వామి చేతుల మీదుగా శివమాలధారణ స్వీకరించారు. అనంతరం స్వామి మాట్లాడుతూ నియమనిష్టలతో శివదీక్ష స్వీకరించి భగవన్నామస్మరణ చేసి శివకృప పొందుతారన్నారు. అంతకుముందు ఆలయంలో మహంతయ్యస్వామి ఆధ్వర్యంలో శివభక్తులు, స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు స్నేహ బోర్‌వెల్ యజమాని శుభస్వామి ప్రసాదవితరణ, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.వీరామణిమాధవ రెడ్డి, నవాంద్గీ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, ఉపసర్పంచ్ శశిరేఖ గోపాల్, నాయకులు గాండ్ల వీరన్న, శ్రావన్‌కుమార్, శివదీక్ష బృందం సభ్యులు రవీందర్‌రెడ్డి, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

దోమ, జనవరి 28: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఆదివారం నూతన అంబేడ్కర్ భవన నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణానికి పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిగి నియోజకవర్గంలోని మండలాల్లో, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి విడతల వారీగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యమ్మ, నర్సిములు, ఎంపీటీసీ అనసూయ, నర్సిములు, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ యాదయ్యగౌడ్, శేఖర్, శేషారెడ్డి, శివకుమార్, రాములు, మాధవులు, నర్సింహాచారి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలంతా శుభిక్షంగా ఉండాలి


అమ్మవారికి పూజలు చేస్తున్న బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్

పెద్దేముల్, జనవరి 28: గ్రామదేవత అనుగ్రహంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ కోరారు. మండలంలోని మంబాపూర్ గ్రామంలో ఆదివారం జరిగిన ఊరడమ్మ జాతర ఉత్సవాల్లో ఆయన గ్రామ సర్పంచ్ రేగొండి శ్రవణ్‌కుమార్, ఎంపీటీసీ యాలటి శ్రీనివాస్‌లతో కలిసి పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు. గ్రామదేవతల ఆశీర్వాదం గ్రామస్థులపై ఎల్లప్పుడు ఉండాలని అమ్మవారికి కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, శుభప్రద్‌పటేల్ యువసేన సభ్యులు భాను, నరేష్‌గౌడ్, విజయ్, చావుష్‌భాయ్, మనోహర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు


సీఎం రేవంత్‌రెడ్డితో గోపాల్‌యాదవ్

బొంరాస్‌పేట్, జనవరి 28: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ బొంరాస్‌పేట్ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గోపాల్ యాదవ్ కలిశారు. ఆదివారం సీఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పరిగి జైలు అధికారికి ఉత్తమ సేవా పురస్కారం


ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకుంటున్న వనజ

పరిగి, జనవరి 28: జైళ్ల శాఖలో ఉత్తమ సేవలందించిన పరిగి సబ్‌జైలు అసిస్టెంట్ వనజ గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. జైళ్ళశాఖ డీజీ డాక్టర్ పి.సౌమ్యమిశ్రా ఆమెకు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పరిగి జైలు జూనియర్ అసిస్టెంట్ వనజను జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా డీఎస్పీ రాంచంద్రం అభినందించారు.

ఇళ్ల మధ్యే మురుగు

- ఇంటి ఆవరణలో తొలగించని పాత విద్యుత్ స్తంభం
- ప్రమాదకరంగా ఉందని చెప్పినా పట్టించుకోని అధికారులు

తాండూరు రూరల్, జనవరి 28: మండలంలోని కోణాపూర్ గ్రామంలోని ఆరో వార్డు బీసీ కాలనీలో మురుగు నీరు ఇళ్ల మధ్యనే పారుతోంది. కాలనీలో బి.రాములు ఇల్లు చివరగా ఉండటంతో ఊళ్లో మురుగు నీరంతా ఆయన ఇంటి ముందు చేరుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన పేర్కొన్నారు. దోమలు, ఈగల బెడద పెరిగిపోయి కుటుంబం అనారోగ్యం పాలయ్యే ప్రమాదముందని బి.రాములు వాపోయారు. ఇదిలా ఉంటే ఇంటి ఆవరణలో విద్యుత్ స్తంభం ఉండగా, అది శిథిలావస్థకు చేరిందని, దాని పక్కనే కొత్త విద్యుత్‌స్తంభాన్ని అమర్చారు. అయితే పాత విద్యుత్ స్తంభం తొలగించకుండా అక్కడే వదిలేశారు. అది కూడా ఇప్పుడు ప్రమాదకరంగా మారింది. పిల్లలను ఆ స్తంభాన్ని పట్టుకుని ఆడుతుండటంతో అది మరింత ఊగుతుందని, ఎప్పుడు ఎవరిపై పడుతుందోనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే మా ఇంటి ముందు విద్యుత్ స్తంభం తొలగించాలని గ్రామానికి వచ్చిన కలెక్టర్‌కు, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి, గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తన ఇంటి ముందు మురుగు నీరు నిలువకుండా చూడాలని, అలాగే ప్రమాదకరంగా ఉన్న పాత విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని బి.రాములు కోరారు.


కోణాపూర్ బీసీ కాలనీలో ఓ ఇంటి వద్ద నిలిచిన మురుగు నీరు


బీసీ కాలనీలో ఇంటి ఆవరణలో వదిలేసిన పాత విద్యుత్ స్తంభం

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుంటాం

పెద్దేముల్, జనవరి 28: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎల్లవేళలా ముందుంటామని బుయ్యని సరళా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగులపల్లి గ్రామంలో నిర్వహించిన బీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిశాయి. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బుయ్యని సరళ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలుపైనా, ఓటమైనా సమానంగా తీసుకోవాలని చెప్పారు. నేటి ఓటమిని రేపటి గెలుపునకు నాందిగా తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాము ఎల్లప్పుడు ముందుంటామని తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన తట్టెపల్లి జట్టుకు మొదటి బహుమతిగా రూ.30వేలు, నాగులపల్లి జట్టుకు రెండవబహుమతిగా రూ.15వేలు అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి.చంద్రశేఖర్, నాగిరెడ్డి, వార్డు సభ్యులు శేఖర్, ఆర్గనైజర్ ఆర్.అశోక్, యాదవరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న బుయ్యని సరళశ్రీనివాస్‌రెడ్డి

అక్రమ నిర్మాణాలకు ఆజ్యం!

- పుట్టగొడుగుల వెలుస్తున్న షెడ్లు
- అందినకాడికి దోచుకుంటున్న ప్రజాప్రతినిధులు
- వాటాలు పంచుకుంటున్న అధికారులు
- ప్రభుత్వాదాయానికి భారీగా గండి


కీసరలో నిర్మిస్తున్న అక్రమ షెడ్లు

కీసర, జనవరి25: గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం కొద్ది రోజుల్లో ముగుస్తుండటంతో ప్రజాప్రతినిధులు అందినకాడికి దోచుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అక్రమ నిర్మాణాల్లో వాటాలు పంచుకుంటున్నారు. కీసర మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలు, షెడ్లు జోరుగా సాగుతున్నాయి. బాధ్యత వహించాల్సిన ప్రజాప్రతినిధులే దగ్గరుండి అక్రమ నిర్మాణాలకు, షెడ్లకు ఆజ్యం పోస్తున్నారు. కీసరలో జరిగే అక్రమ నిర్మాణాలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అటు జిల్లా అధికారులు కానీ, మండల అధికారులు గానీ పట్టించుకున్నపాపాన పోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం, నోటీసులు జారీ చేస్తాం అనే సమాధానాలు అధికారుల వైపు నుంచి వినిపిస్తున్నాయే తప్పా చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారుల పనితీరు దున్నపోతుపై వర్షం కురిసిన చందంగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్న అధికారులు ప్రభుత్వాదాయానికి గండి కొడుతూ అక్రమ నిర్మాణాదారులు ఇచ్చే సొమ్మును తమ జేబుల్లో వేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ఉన్నత అధికారులు స్థానిక అధికారులపై చర్యలు తీసుకోకపోతే కీసరలో అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా జరిగి ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చీమలదరి ప్రజలకు రుణపడి ఉంటా


సర్పంచ్ ఎన్.నర్సింహారెడ్డిని బంగారంతో తులాభారం చేస్తున్న గ్రామ పంచాయతీ పాలక వర్గం నర్సింహారెడ్డి యువసేన సభ్యులు

మోమిన్‌పేట్, జనవరి 28 : చీమలదరి ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని సర్పంచ్ ఎన్.నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చీమలదరి గ్రామపంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ ఉన్నా లేకున్నా పిలిస్తే పలుకుతానన్నారు. ప్రజల సహకారం మరవలేనదని, మర్చిపోలేదని అన్నారు. గ్రామాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లానని అన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనం, అండర్ డ్రైనేజీ, మన ఊరు-మనబడి కార్యక్రమంలో పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని నిర్మించామన్నారు. రోడ్లకిరువైపులా చెట్లు నాటించామని, ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయించామని చెప్పారు. బీఎస్ఎన్ఎల్ ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్ సదుపాయం కల్పించడంతో పాటు వైఫై సేవలను అందించామని గుర్తుచేశారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చే విధంగా పని చేశామన్నారు. ఐదేళ్లలో రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఇంకా రెండు పనులు మిగిలిపోయాయని, గ్రంథాలయం, కమ్యూనిటీ హాలును సొంతంగా నిర్మిస్తానన్నారు. సర్పంచ్‌గా రెండు సార్లు ప్రజలు గెలిపించడం సంతోషదాయకమని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను నర్సింహారెడ్డి యువసేన సభ్యులు బెల్లం, రూ. ఐదు నాణాలతో తులభారం చేశారు. అనంతరం సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించారు. ఎంపీటీసీ మానసఇంద్రారెడ్డి, వెంకన్న, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, చెన్నారెడ్డి, విష్ణుగౌడ్, రత్నయ్య, శాంసన్, కృష్ణ, పాండు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ధారూరు పంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు

ధారూరు: ధారూరు గ్రామ పంచాయతీ పాలకవర్గం వీడ్కోలు సమావేశం పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా సర్పంచ్ యు.చంద్రమౌళి అధ్యక్షతన పాలకవర్గంలోని ఉప సర్పంచ్ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి అంజ్యానాయక్, వార్డు సభ్యులకు శాలువా పూలమాలతో సత్కరించారు.


ధారూరులో పంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు సన్మానం

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

మూడుచింతలపల్లి, జనవరి 28 : కేశవరం తండాలో ఉన్న శ్రీ బాలాజీ వేంకటేశ్వర కళాశాల 23వ వార్షికోత్సవాన్ని ఆదివారం కళాశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు కామిడి వీరారెడ్డి విగ్రహానికి చైర్మన్ కామిడి మధుసూదన్‌రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాతల సహకారంతో నిర్మించిన సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే భావనతో కళాశాలను వీరారెడ్డి స్థాపించారని గుర్తు చేశారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. ఫీజుల ఒత్తిడి లేకుండా అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన జరుగుతోందని, నిరుపేదలైన విద్యార్థులకు విద్యను అందించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన కళాశాలకు పలువురు సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల మాజీ చైర్మన్ రాంరెడ్డి, కోశాధికారి నాగభూషణం, ఉపాధ్యాక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజయ్యగుప్త, సహాయ కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, ఎంపీటీసీలు హన్మంతరెడ్డి, నాగరాజు, సర్పంచ్ రవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

రేషన్‌కార్డుల ఈ- కేవైసీ గడువు పొడిగింపు

దోమ, జనవరి 28: రేషన్‌కార్డు ఈ కేవైసీ గడువును పొడిగించినట్లు తహసీల్దార్ పురుషోత్తం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ-కేవైసీ గడువును ప్రభుత్వం ఫిబ్రవరి 29 వరకు పెంచిందన్నారు. రేషన్ కార్డుకు ఆధార్ కార్డును అనుసంధానం చేసుకొని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

శామీర్‌పేట, జనవరి 28: శామీర్‌పేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం శామీర్‌పేటలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సురేందర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5.30గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.